# పర్యవసానం

పర్యవసానం యిట్లా వుంటుందనుకుంటే, నేనాపని అసలు చెయ్యకండానే వుండేవాడిని. ఏమంటే ఆదర్శాలకోసమనీ, అభిప్రాయాలకోసమనీ తహతహ లాడటమే గాని, మరోడిని ఏడిపిద్దామన్న ధ్యాస నాకెప్పుడూ లేదు.

రామ్మూర్తీ, నేనూ స్నేహితులం కాకపోం. మాకు కావలసినంత సన్నిహితత్వం వున్నది. కిందటిసారి బెజవాడ ''ప్లాటుఫారం'' మీద కనిపించినప్పుడాయన, సత్యనారాయణ దురాగతాల గురించి ఉపాఖ్యానాలు చెప్పుకు పోయినాడు. సత్యనారాయణ గుమాస్తా వుద్యోగం చేస్తున్నాట్ట. ఆ పనివాడికి ''హాయి''గానే వున్నదట! గుమాస్తా వుద్యోగాన్ని ఏవగించుకోలేకపోవటం, సత్యనారాయణ పట్ల రామ్మూర్తి కనిపెట్టిన మొదటి తప్పు గావును!

''వాడు గుమస్తా చేస్తున్నాడని నాకేం యేడుపు లేదు. గుమాస్తాగా నిజాయితీగా బతకటానికి వీల్లేదా? కనబడ్డ వాడినల్లా, చెయ్యి జాపి లంచాలు లాగాల్సిన ఖర్మయేం? పైగా వాడాపని చెయ్యటం యేమీ ఏహ్యంగా చూసుకోవటం లేదు కూడ. చిన్నప్పుడు మనం అనుకున్న ఆదర్శాలేమిటి? ఇప్పుడు ఆచరిస్తున్నవేమిటి?''

రామ్మూర్తికి చాలా కోపం వచ్చిందని గ్రహించాను. నా కేమీ తోచటం లేదు అపుడు. రామ్మూర్తి నాకు చెప్పిందానిలో తప్పేమీ లేదు.

అట్లే ఆలోచించగా, నాకు సత్యనారాయణ చేస్తున్నది ద్రోహమేనని తోచింది. తప్పకుండా మరి! లోకులసొమ్ము రావటానికి అనువైన మార్గాలు వుంటే మాత్రం? ఆలోచన పాలోచనా లేకుండా నింపుకోటమేనా? ఇవాళ తిన్నంతలో యేముంది, రేపు జీర్ణించుకోవద్దూ?

ఱబ్బుచేసి చస్తాడు వాడు. కాని సత్యనారాయణ మాకు స్నేహపాత్రుడు. అట్లాంటివాడు ఛస్తూవుండగా, మేము నోరుమూసుకొని వూరుకోం. ఎట్లాగైనా వాడిని రొంపిలోంచి లాగాలి.

"ఊహూ. లాభంలేదు. వాడు అజ్ఞానంలో గూడు కట్టుకు పోయినాడు. వాడికి తాత్కాలికంగా కోపం తెప్పించయినా సరే, యీ పని మానేట్టు చెయ్యాలి" అన్నాడు రాంమూర్తి.

"బొత్తిగా మాట వినడా?" అన్నాను.

"చతురోపాయాలు ప్రయోగించాను. నాఅభిప్రాయం మీద వాడికి వీసమెత్తు నమ్మకమూ లేకపోతే---". కాఫీ తాగి నింపాదిగా ఆలోచిస్తే మా రామ్మూర్తికి చక్కటి ఆలోచన తట్టింది.

"వాడి ఆఫీసరుకు పెటిషను పెడదాం. బాగా చివాట్లు వేస్తాడు. ఇక మానెయ్యక మార్గమేమిటి?" అన్నాడు.

"ఈ సంగతి యింతకు ముందే ఆయనకు తెలియదంటావా?" అన్నాను.

"తెలీదనికాదు - తెలిసినా తెలీనట్లే నటిస్తాడు. నటించాలి! జనవాక్యం వ్యతిరేకంగా వున్నదని తెల్సుకున్నాక ఆయన నోరు చేసుకోక మానడు. ఇదంతా లౌకికంలే" అన్నాడు రామ్మూర్తి.

"ఊ అయితే యివాళే పోస్ట్ చేస్తాను" అన్నాను. నా ఉత్సాహం, రామ్మూర్తికి విజయం సాధించినటే అయ్యింది. చిటిక వేసి వెళ్ళి పోయాడు.

సరిగ్గా వారంరోజులు తిరిగేటప్పటికి, నాకు సత్యనారాయణ కార్డుముక్క రాశాడు. దానిలో "నావుద్యోగం వూడింది" అన్నముక్క మాత్రమే వుంది. రామ్మూర్తి ఆనాడు తెనాలిలో వుంటాడని తెలిసే వెళ్ళాను. నాకన్నా ఎక్కువగానే ఆశ్చర్యపోయడతను, నోటివెంట మాటే రాలేదు.

"ఇదంతా మనం చేసిందే" అన్నాను. నాకెందుకో రాంమ్మూర్తిని నమిలి మింగేద్దామన్నంత కోపం వచ్చింది. ఇతను కనిపించబట్టేగదా, యీ వుపద్రవమంతాను!

"ఏం చేదాం?"

"ఒకడి వుద్యోగం తీసేయించటం, నిమిషాల మీది పని. కాని అలాంటిదొకటి సృష్టించటం బ్రహ్మకుకూడా తరంకాని రోజులివి" అన్నాను. ఆక్షణమే సత్యనారాయణకు రాంమూర్తి అర్లై రూపాయలు మనియార్డరు చేశాడు. మేమిద్దరం కూడాచేయగలిగిందంతే.

ఆ మర్నాడే, సత్యనారాయణనుంచి కవరు వచ్చింది. ఓపిగ్గా చించి, చదివాను. "నావుద్యోగం పోయింది. ఎందుకు పోయిందని అడుగు చెబుతాను. నాకిచ్చే జీతం డెబ్బై రూపాయలు. నా జీవితానికది చాలదు. కనీసం సరి పెట్టుకుందామనుకోవటం కూడా సిగ్గుచేటు పని! ఆఫీసరు నాకష్టానికీ, శ్రమకీ తగ్గ ధర కడుతున్నాడో లేదా అన్న ప్రశ్న అటుంచి, నాకోసం రోజూ వచ్చే ఆసామీల పన్లు తొందరగా చేసి పంపటంవల్ల, నేను డబ్బు సంపాయించ గలిగాను. ఈ రోజున యేమీ జీతం లేకుండానే, ఆఫీసులో పూర్వేపని చెయ్యటానికి అనుమతించినా, నాకు పరమ సంతోషమే; యేమంటే నెలసరిని ఇలాంటి డెభైలు మూడు కళ్ళచూడొచ్చు!

లంచాలు తీసుకోవటం న్యాయమా,కాదా అన్న మీమాంసకొద్దీ నా బుర్ర చిన్నప్పుడే పాడుచేసుకున్నాను. (ఈ సంగతి నీకు, రామ్మూర్తికి కూడా తెలుసు!) అయితే ఒక నిశ్చితార్థం మాత్రం దొరకలేదు. ఇప్పట్లో నా ప్రసక్తే లేకండా దాదాపు, ఈ సమస్య కనువిప్పయింది. లంచంకోసం నేనెవడినీ బలవంతం చెయ్యటం లేదు, అథవా చేదామని భావనయినా నా బుర్రలో కలగలేదు. నా ఆఫీసుకు వొస్తుండే ఏ పెద్ద మనిషీ కూడా తను కోరుకున్న పని యీ జన్మలో అవుతుందని ఆశించడు. అట్లాంటి వాడికి రెండు నిమిషాల్లో ప్రయోజనం అగుపిస్తే ఆనందం అర్ణవం కాక మరేమిటి? ఆ ఆనందార్ణవంలో వందలూ వేలూ విరజిమ్మినా ఆశ్చర్యం లేదు.

"ఈ పాపిష్టి సొమ్ముతిని, మేడలు కడదామని నా కెప్పుడూలేదు... నా వుద్యోగం వూడటానికి కారణం ఎవరో నాకు తెలీదు. అయితే, డబ్బు కుమ్మరించిన వాళ్ళెవరూ ఆపని చేసి వుండరని నాకు రూఢీ, ఎంచేతనంటే వాళ్ళా సంగతి యింకా గుర్తుంచుకుంటా రన్నది నమ్మదగ్గ విషయంకాదు. బితకలేనని కాదు,ఈ గోడంతా, కాని నాలుగు రోజుల పాటు బాధలు తప్పవుగదా అని..."

ఉత్తరం చదివిన మా నోళ్ళు నొక్కుకు పోయాయి. సత్యనారాయణ, ఆదర్శాల్లో మాకన్నా ఎందులో ఎంత తీసి పోయాడో అర్థం కాక తికమకలు పడ్డాం. ♣

(తెలుగు స్వతంత్ర)